మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# దశాబ్ది పేరుతో దగా చేస్తున్న కేసీఆర్..!

**అచ్చంపేట, జూన్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలనలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. చేసింది గోరంత అయితే కొండంత చేశామని ప్రగల్భాలు పలుకడమే తప్ప అభివృద్ధి శూన్యమని ఆయన తెలిపారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో అమరవీరుల స్థూపం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీలు నిర్వహించారు. దశాబ్ది దగా పేరుతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుల దిష్టిబొమ్మలను రవాణాసురిడిలా తయారు చేసి దగ్ధం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, 10 సంవత్సరాలు కాకుండా దశాబ్ది ఉత్సవాలు చేసుకోవడం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నిర్వహిస్తున్నారన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేస్తూ, నీళ్లు, నిధులు, నియామకాల నినాదంపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏమి అమలు కాలేదన్నారు. మరోసారి గద్దెనెక్కేందుకు దశాబ్ది ఉత్సవాల పేరుతో అంగు అర్భాటాలు చేస్తున్నారు తప్ప మరొకటి కాదన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్‌బెడ్‌రూం, పోడు భూములకు పట్టాలు, రైతు రుణమాఫీ, 12 శాతం ముస్లిం, గిరిజనుల రిజర్వేషన్లు అమలు కానీ హామీలతో తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్న బీఆర్ఎస్ పార్టీని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాపురం రాజేందర్, రఘురాం, శ్రీనివాసులు, గౌరిశంకర్, గోపాల్‌రెడ్డి, రామనాథం, నరసయ్యయాదవ్, హరినారాయణగౌడ్‌తో పాటు పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.



అచ్చంపేటలో నిరసన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుల దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తున్న దృశ్యం

# అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి:కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త :** అమరవీరుల త్యాగాలు వెల కట్టలేనివని అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మూలమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం అమరవీరులకు నివాళి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరి రోజు తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తుచేస్తూ అమలరు స్తూపం వద్ద నివాళులర్పించారు. సమావేశంలో అధికారులు గోవిందా రాజన్, కన్యాకుమారి, రషీద్, కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావు, పిఎ నాగేంద్రప్రసాద్ కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఈవిఎంలను పరిశీలించిన కలెక్టర్..** ఈవిఎంలు, వివి ప్యాడ్స్ ఫస్ట్ లెవల్ తనిఖీ చేసి పూర్తి స్థాయిలో పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం జడ్పీ పక్కన ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు ఈవిఎంలు, వివిప్యాడ్స్ ఫస్ట్ లెవల్ (ఎఫ్ఐసి)భౌతిక పరిశీలన చేసే ప్రక్రియను పరిశీలించారు. ఇసిఎల్ హైదరాబాద్ నుండి వచ్చిన బ్యాలెట్ యూనిట్లు 190, కంట్రోల్ యూనిట్లు 140, వివి ప్యాడ్స్ 61లను పూర్తిస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఆర్డీఓ రాంచందర్, తహసిల్దార్ దానయ్య, జగదీశ్వర్ పాల్గొన్నారు.

# సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది..!

**- జిల్లాకు కేంద్రం ఇచ్చిన నిధులను ప్రజలకు వివరిస్తాం..**

**- మీడియా సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ తీరు సొమ్మొకరిది.. సోకొకరిది అన్న చందంగా ఉందని కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్రం నేతలు తామే ఇచ్చినట్లు ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేండ్లలో కేంద్రం ఎన్నో సంక్షేమ అభివృద్ధి, పథకాలను అమలు చేస్తుందని, వ్యవసాయం, కార్మికుల సంక్షేమం, స్వచ్ఛ భారత్ లాంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. కేంద్రం సహకారం లేనిదే ఏ ఒక్క పథకం కూడా అమలుకాదన్నారు. వేరే జిల్లాల జిల్లా కేంద్రాలకు, కలెక్టరేట్లకు నాలుగు వరుసల రోడ్డు ఉందని, పాలమూరు జిల్లాకు కూడా కావాలని తాను పార్లమెంట్ నిలదీయడంతో అప్పటి పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి, రూ.234 కేంద్రం మంజూరు చేసి, అప్పన్నపల్లి ఆర్‌వోబీ కూడా కేటాయించినట్లు గుర్తు చేశారు. అయితే రోడ్డు పనులు పూర్తయినా కాంట్రాక్టర్ అచ్చంపేట జలంధర్ నేటికీ కూడా సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు హ్యాండోవర్ చేయలేదని, అలాంటిది స్థానిక మంత్రి ఆర్‌వోబీని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఇలాగే మున్సిపల్‌రోడ్డు, ఇతర అభివృద్ధి తామే చేస్తున్నామని చెప్పుకుంటున్న వారికి బుద్ధి చెప్పేలా త్వరలోనే కేంద్రం నుంచి మంజూరైన నిధుల డాటాను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్తామని అప్పుడే ప్రజలే తేల్చుకుంటారని తెలిపారు. లిక్కర్, రవాణా, రిజిస్ట్రేషన్లు, వ్యాట్, సేల్స్ ట్యాక్స్ మీద వ్చే స్టేట్ ఓన్డ్ రెవెన్యూ మొత్తం కలిపినా కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగలు, పెన్షనర్ల జీతాలు ఇచ్చేందుకు కూడా సరిపోవడం లేదని, అభివృద్ధి నిధులు అన్ని కూడా కేంద్రం డబ్బులే అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో అన్ని నిధులు ఉంటే జీతాలు 15తారీఖు తర్వాత ఎందుకు ఇస్తుందని, జిల్లాల వారీగా విభజన చేసి ఎందుకు ఇస్తుందని ప్రశ్నించారు. అప్పన్నపల్లి ఆర్‌వోబీ, ఫోర్‌వే లైన్ రోడ్డు అధికారికంగా పూర్తయినట్లు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రికి త్వరలోను కేంద్రం మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

# పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై సర్టిఫికెట్స్ వెరిఫికేషన్..

**గద్వాల ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా, వనపర్తి జిల్లాల నుండి ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కొరకు ఎంపికైన అభ్యర్థులకు వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం 522 మందికిగాను 471 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఈ వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని జిల్లా ఎస్పీ కె.సృజన తెలిపారు. అనుమతిలేని గైర్హాజరు అయిన వారి విషయంలో బోర్డు అనుమతితో మాత్రమే ఉంటుందని తరువాత అనుమతించబడదని, ఈ విషయాన్ని అభ్యర్థులు గ్రహించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యా ధృవీకరణ పత్రాలు తీసుకుని ఉదయము 9 గం.ల జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎఓ సతీష్‌కుమార్, సాయుధ దళ డీఎస్పీ ఇమ్మానియేల్, సూపరింటెండెంట్‌లు నయీం, ఐటిసెల్ ఎస్సై రజితతో పాటు పరిపాలన విభాగంగా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్పొరేషన్‌గా మహబూబ్‌నగర్..!

**వీరన్నపేటలో కార్యాలయం ఏర్పాటు చేస్తాం.. మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త :** మున్సిపాలిటీగానే మహబూబ్‌నగర్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నదని త్వరలో కార్పోరేషన్‌గా మారనుందని అప్పుడు అభివృద్ధి మరింత కొత్త పుంతలు తొక్కనుందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా. వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అమరవీరులను స్మరించుకొనుటకై స్థానిక మున్సిపల్ మీటింగ్‌లో ఏర్పాటు చేసిన కౌన్సిల్ ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారికి ఈ సందర్భంగా మౌనం పాటించి నివాళులర్పించారు. అమరుల త్యాగాలను శ్లాఘిస్తూ తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. మున్సిపల్ కార్పోరేషన్ అయ్యాక ఛైర్మన్ కాస్త మేయర్ అవుతారని కౌన్సిలర్లు కార్పోరేటర్‌గా మారుతారని మహబూబ్‌నగర్ పట్టణం నగరంగా మారబోతోందని ఆయన వెల్లడించారు. జిల్లాకేంద్రంలో అన్ని వైపులకు అభివృద్ధిని విస్తరించేందుకు త్వరలో వీరన్నపేటలో జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న ఎస్పీ కార్యాలయం జోగులాంబ జిల్లా డిఐజి కార్యాలయంగా సేవలందించనుందన్నారు. ఇప్పటికే ఐటి టవర్, లిథియం అయాన్ గిగా ఫ్యాక్టరీలను తీసుకువచ్చామని త్వరలో ఈవీ కార్ల తయారీ పరిశ్రమను కూడా తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే ప్రతిపాదిత విమానాశ్రయం కొన్ని సాంకేతిక కారణాలవల్ల వాయిదా పడిందని త్వరలోనే అనువైన స్థల సేకరణ చేసి విమానాశ్రయం ఏర్పాటుకు కూడా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై విమానాల సంఖ్య పెరిగి అధిక ఒత్తిడి పెరిగిందని మన వద్దఎయిర్ పోర్టు ఏర్పాటుచేస్తే కార్గో, ప్రయాణికుల విమానాల రాకపోకలకు కూడా వెసలుబాటు ఏర్పడుతుందన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మన ఎయిర్‌పోర్టు అనుబంధంగా మారనుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు సభలో ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, కమిషనర్ ప్రదీప్‌కుమార్, వైస్ ఛైర్మన్ గణేష్, ఫ్లోర్ లీడర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, షషబ్బీర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఇంతటి అభివృద్ధి చేశామా ఆశ్చర్యమనిపిస్తుంది..**

**అప్పుడు ఒక జిల్లా మొత్తం వలస వెళ్లినట్లుగా ఉండేది**

**జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 22 రోజులపాటు ఘనంగా జరిగిన కార్యక్రమాలలో సింహావలోకనం చేసుకున్న అభివృద్ధి కార్యక్రమాలను చూస్తే ఇంతటి అభివృద్ధి పనులు చేపట్టామా అని తనకే ఆశ్చర్యం కలిగిందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంఏర్పడిన తర్వాత శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి సంతోషం కలుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అమర వీరులను స్మరించుకొనుటకై స్థానిక జడ్పీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటుచేసిన జిల్లా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారికి ఈ సందర్భంగా నివాళులర్పించారు. అమరుల త్యాగాలను శ్లాఘిస్తూ తీర్మాణం చేశారు. ఈసందర్భంగా మంత్రి ప్రసంగించారు. సమైక్య రాష్ట్రంలో తాగునీరు, కరెంటు సరఫరా చేయలేని పరిస్థితుల్లో సర్పంచ్‌లు, ఎంపిపిలు, జడ్పీటిసిలు గ్రామాలకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండేదని, కరెంటు ఏఈ గ్రామానికి వెళ్తే ఎక్కడ కొడతారో అని భయపడే వారని అన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్, సాగునీరు, ఇతర మౌలిక వసతులన్ని నెరవేరి అందరు సంతోషంగా ఉన్నారని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో జిల్లా కేంద్రం నుంచి నిత్యం వందలాది అంబులెన్స్‌లు హైదరాబాద్ వెళ్లేవని అక్కడి నుంచి మృతదేహాలు తిరిగివచ్చేవని గత పరిస్థితులను గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వైద్య పరంగా ఎంతో ప్రగతి సాధించామన్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా త్వరలో ఉమ్మడిజిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. సమైక్య రాష్ట్రంలో 14 లక్షల మంది ఉపాధి నిమిత్తం వలస వెళ్లే వారిని ఇప్పుడు ఆ సంఖ్య ఒక జిల్లాలో ఉన్న జనాభాతో సమానమన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వలసలకు ఫుల్‌స్టాప్ పడిందన్నారు. ఇప్పుడిప్పుడే ఈ ప్రాంతం బాగుపడుతుంటే కొందరు దుర్మార్గులు కుట్రలు చేస్తున్నారని ప్రజలు వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, జడ్పీ వైస్‌ఛైర్మన్ యాదయ్య, జడ్పీ సీఈఓ జ్యోతి, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, ఎంపిపిలు, జడ్పీటిసిలు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హాజరైన సభ్యులు

# తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం:జడ్పీ ఛైర్‌పర్సన్

**గద్వాల ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా జడ్పీ ఛైర్మన్ సరిత అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరి గురువారం తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని స్మృతివనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, డా.అబ్రహాం, మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, మార్కెట్ ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్‌లతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. అప్పుడు వారు చేసిన త్యాగాలకు ఫలితంగా తెలంగాణలో వారికి నివాళులు అర్పించుకుంటున్నామని, నాటి ఉద్యమంలో అమరుల త్యాగాల ఫలితంగానే రాష్ట్రం ఏర్పడి నేడు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని, అమరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. జిల్లా అభివృద్ధి జరగాలంటే మీ అందరి సహకారం ఉండాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరంలో ఉన్నందున, 9 సంవత్సరాలు సాధించిన ప్రగతిని జూన్ 2 నుండి ఈ రోజు వరకు దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నామని, చివరిరోజు అమరుల సంస్మరణ సభ నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని, తెలంగాణా ప్రభుత్వం ఉద్యమంలో పాల్గొని అమరులైన వారిని గుర్తించి వారికి న్యాయం జరగాలనివారి స్మారక చిహ్నాలను ప్రారంభించుకున్నామని అన్నారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ శాంతియుతంగా తెలంగాణా రావాలనే ఉద్దేశంతో తెలంగాణా ఉద్యమానికి పునాదివేసి రాష్ట్ర ముఖ్యమంత్రి యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని, తెలంగాణ ఉద్యమంలో చాలా మంది ప్రాణాలు కోల్పోయి అమరులైనవారని అన్నారు. ఎమ్మెల్యే అబ్రహాం మాట్లాడుతూ గతంలో 54 సంవత్సరాల నుండి ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత జరిగిందని తెలంగాణ కొరకు 1200ల మంది విద్యార్థులు తమ ప్రాణాలర్పించి అమరులయ్యారని

- మిగతా4లో..



అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న దృశ్యం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

# అమరులకు మించిన త్యాగం మరొకటి ఈ సృష్టిలో లేదు..!

**- సమాజంలోని ప్రజలంతా ఉన్నతంగా నిలవాలన్నదే అమరుల ఆలోచన ఆకాంక్ష**

**- తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వారి కుటుంబ సభ్యులకు పూలమాల, శాలువాతో సత్కారం**

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి, జడ్పీచైర్మన్, కలెక్టర్, ఎస్పీ



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

**వనపర్తి ప్రతినిధి, జూన్22, ప్రభాతవార్త:** అమరులకు మించిన త్యాగం మరొకటి ఈ సృష్టిలో లేదని, అమరులను స్మరించుకోవడం అంటే వారి ఆకాంక్షలను నెరవేర్చడం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరి రోజైనా గురువారం అమరుల సంస్మరణ వేడుకలను వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి తో కలిసి అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉదయం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి మంత్రి , జడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వరుసగా పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... అమరులను స్మరించుకోవడం అంటే కేవలం పూలు చల్లడం కాదని, సమాజంలోని ప్రజలంతా ఉన్నతంగా నిలవాలన్నదే వారి ఆలోచన ఆకాంక్ష అని తెలిపారు. తెలంగాణ అమరవీరులు ఏ ఆకాంక్షతో అయితే వారు తమ ప్రాణత్యాగం చేసి అమరులయ్యారో అట్టి ఆకాంక్షలను నెరవేర్చేందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చుతూ వస్తుందన్నారు. అందుకే నేడు తెలంగాణ దేశంలో చాలా విషయాల్లో అగ్రగామిగా నిలుస్తుందని తెలిపారు. హైదరాబాద్ రాష్ట్రానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్రాల్య కోసం ప్రపంచంలో అనేక పోరాటాలు జరిగాయి. కానీ 1948 వరకు స్వతంత్ర ప్రాంతంగా కొనసాగిన హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం అయిన తరువాత కొంత ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్రలో కలపడం జరిగింది. అప్పటికీ ప్రత్యేక రాష్ట్రంగా ఉన్న హైదరాబాద్‌ను 1956 లో బలవంతంగా అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో కలపడం జరిగిందన్నారు. స్వాతంత్ర్యం కోల్పోయి స్వాతంత్ర్యం కోసం కొట్లాడిన చరిత్ర తెలంగాణదని చెప్పారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రలో విలీనం చేశారని 1956 నుండి 2014 వరకు అనేక మంది తెలంగాణ కోసం అమరులయ్యారని అన్నారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు ఎందరో తమ కులవృత్తులు ఉపాధులు కోల్పోయారని గుర్తు చేశారు. దాదాపు రెండు తరాలు నష్టపోయాయని, మూడో తరం చేసిన పోరాటంలో తెలంగాణ సాధించుకున్నాం అన్నారు. సమైఖ్య పాలకులు మనల్ని బానిసలుగా చూశారని, తెలంగాణ భాష, యాస, అభివృద్ధి , ప్రతిభ వంటి అన్నింటిలో వివక్ష చూపారన్నారు. పాలకుల చిన్న బుద్ధి వల్ల ప్రజల మధ్య విభేదాలు వచ్చాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమం అర్థమైతేనే తెలంగాణ పునర్నిర్మాణం అర్థమవుతుందని చెప్పారు. తొమ్మిదేళ్ల కాలంలో ప్రాధాన్యత క్రమంలో అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టి దేశంలో అగ్రగామిగా నిలుస్తుందని తెలియజేశారు. అనంతరం వనపర్తి జిల్లా నుండి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వారి కుటుంబ సభ్యులను పూలమాల, శాలువాతో సత్కరించి వారితో సహపంక్తి భోజనం చేశారు. దాసరి నరేష్ తల్లి గారైన దాసరి చెన్నమ్మ, కొత్తకోట నుండి కావలి సువర్ణ తల్లి కావలి రాములమ్మ, వీరాసాగర్ వారి అక్క పద్మ, సత్యమ్మ కుమారులైన నాగరాజు, ఆంజనేయులు లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అడిషనల్ ఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, ఆర్డీవో పద్మావతి, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్మన్



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

# ఓటమి భయంతోనే ఉత్సవాలు..!

- తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..
- టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అనిరుధ్‌రెడ్డి, నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్22, ప్రభాతవార్త :** తెలంగాణలో ఓటమి భయంతోనే సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నా రని, పదేండ్లలో చొప్పకోదగ్గ అభివృద్ధి ఏం చేశారో చెప్పాలని టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనంపలి అనిరుధ్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ పిలుపుమేరకు జడ్చర్ల నియోజకవర్గం కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు నిరసనగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీలు ఇవ్వడం తప్ప.. అమలు చేసింది ఏమీ లేదన్నారు. రుణమాఫీ, నిరుద్యోగులకు నోటిఫికేష్లు, కేజీ టు పీజీ విద్య దళితులకు మూడెకరాల భూపంపిణీ ఏ ఒక్కటైనా నెరవేర్చారో చెప్పాలన్నారు. ఏం అభివృద్ధి సాధించారని ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జడ్చర్లలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అనిరుధ్‌రెడ్డి సమక్షంలో చేరికలు..**

జడ్చర్ల మండలం ఈర్లపల్లితండాలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు 30మందికిపైగా టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా అనిరుధ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

## దేవరకద్రలో బస్టాండుకోసం ప్రతిపాదనలు పంపండి

**అధికారులకు ఎమ్మెల్యే ఆల ఆదేశం**



**దేవరకద్ర,జూన్ 22 ప్రభాతవార్త:** దేవరకద్రలో కొత్త బస్టాండుకోసం ప్రతిపాదనలు పంపాలంటూ అధికారులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారంఆదేశించారు. అలాగే దేవరకద్రలో ఆర్‌ఓబి వంతెనకు ఇరువైపుల తాత్కాలిక బస్టాండులను కూడ ఏర్పాటు చేయడానికి కూడ అధికారులను ఆయన ఆదేశించారు. దేవరకద్రలో ఆర ఓబి వంతెన ప్రారంభించినందుకు రైల్వే గేటును మూయడం వల్ల ప్రస్తుతం ఉన్న బస్టాండులోకి బస్సులు వెళ్ళడానికి వీలుకాదు కాబట్టి స్థానికంగా మరో కొత్త బస్టాండుకోసం స్థలపరిశీలన చేయడం జరిగిందన్నారు. కావున అధునాతన, అన్ని వసతులతో కూడిన శాశ్వత కొత్త బస్టాండు ఏర్పాటు కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఎమ్మెల్యే ఆల ఆదేశించారు.

## ఉత్సవాలు చేస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న సీఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



**గద్వాల ప్రతినిధి,జూన్ 22 ప్రభాతవార్త :** నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం అనే నినాదంతో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆ నాలుగు అంశాలను తుంగలో తొక్కి తెలంగాణ ప్రజల ఆశలను, ఆశయాలను తొమ్మిదేళ్లుగా నిర్వీర్యం చేస్తూ మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన కెసిఆర్ తన అసమర్థ పాలనను కప్పి పుచ్చుకోవడానికి దశాబ్దం కాకముందే దశాబ్ద ఉత్సవాల పేరిట తెలంగాణలో దరిద్రపు ఉత్సవాలు చేస్తూ అన్ని వ్యవస్థలను నాశనం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారని నిరసిస్తూ తెలంగాణ పిసిసి మేరకు ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డా. ఎస్ఏ.సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు అలంపూర్ నియోజకవర్గం నడిబొడ్డున శాంతినగర్ పట్టణంలో సీఎం కెసిఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ముఖ్యమంత్రి దశాబ్ది ఉత్సవాల పేరిట రోజుకొక అంశాన్ని నెత్తికెత్తుకుని కొత్త కొత్తవేషాలు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన గోరక్షణ జన జాగరణ..



**మక్తల్,జూన్22 ప్రభాతవార్త:** స్థానిక నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో విశ్వహిందూ పరిషత్ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన గో సంరక్షణ జన జాగరణ గోడపత్రికలను కరపత్రాలను పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు గావించి విడుదల చేయడం జరిగింది. కార్యక్రమంలో భారతీయకిసాన్ జిల్లా అధ్యక్షులు కావలి వెంకటేష్, అఖిల భారత అయ్యప్ప దీక్షసమితి సభ్యులు అశోక్‌గౌడ్, గురుస్వామి, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు కె. సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షులు డా. ఆకప్ప, ప్రఖండ భజరంగ్ దళ్ భీమేష్, నరేష్, శ్రీనివాస్, మూర్తి, రాహుల్, అక్షయ్ పాల్గొన్నారు.

## అమరవీరులకు ఘనంగా నివాళులు..



**కెటిదొడ్డి,జూన్ 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అమరవీరుల సంస్మరణ సమావేశాన్ని నిర్వహించడానికి గురువారం కెటి దొడ్డి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపి పి మోహనమ్మ అధ్యక్షతన ఆత్మవీరుల సమావేశం నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముఖ్య భూమికను పోషించి ప్రాణత్యాగాలు చేసిన అమర వీరులను స్మరించుకుని వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు, ఎంపిటిసిలు భీమన్న, శంకరమ్మ, శాంతమ్మ, గోవింద్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ హుసేన్, మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి మహ్మద్ ఆజార్ మొహిద్దిన్, మండల పంచాయతీ అధికారి అబ్దుల్ సయ్యద్‌ఖాన్, అగ్రికల్చర్ ఏఓ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఎపిఓ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి సిబ్బంది, బిఆర్ఎస్ నాయకులు చక్రధర్‌రావు పాల్గొన్నారు.

## అమరుల త్యాగఫలమే తెలంగాణ..



**చిన్నచింతకుంట,జూన్ 22 ప్రభాతవార్త :** అమరుల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రమని ఎంపిపి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరిరోజు సందర్భంగా మండల పరిషత్ సమావేశ హాల్‌లో అమరుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించి సాధించుకున్న తెలంగాణ కెసిఆర్ సారథ్యంలో బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికై కెసిఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన తెలిపారు. అమరుల కుటుంబాలకు కెసిఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ సువర్ణరాజు, ఎంపిడిఓ శ్రీనివా స్‌రెడ్డి, ఎస్సై మోహన్‌బాబు, ఎఓ రాజేష్‌ఖన్నా, ఎంపిఓ అనిల్, ఎంపిటిసిలు ఉషారాణి ప్రేమ్‌కుమార్, నెల్సన్, నాయకులు జహంగీర్, వజీర్‌బాబు, యాకోబ్, రియాజ్, కురుమూర్తిరాజు, రవితోపాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## నవోదయ పాఠశాలకు సరస్వతి పాఠశాల విద్యార్థులు ఎంపిక




**ఇటిక్యాల,జూన్22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం విడుదలైన నవోదయ పాఠశాలలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మహేష్‌చంద్ర అచరా నందన్‌లు ఆరవ తరగతిలో చేరేందుకు జవహర్ నవోదయకు పరీక్షరాయగా గురువారం విడుదలైన నవోదయ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. వీరికి వట్టెంలో గల జవహర్ నవోదయ స్కూల్‌లో సీట్లు పొందారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వి.గోవర్ధన్‌రెడ్డి, డైరెక్ట ర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ నందిని, ఉపాధ్యాయులు అభినందించారు.

## సానుభూతి తెలిపిన యువజన నాయకులు ఆర్. కిశోర్



**అలంపూర్,జూన్ 22 ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన మరియమ్మ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట ఆనంద్, వెంకట్రాములు, సత్యరాజు, డేవిడ్, పురుషోత్తం, దేవన్న, మద్దిలేటి, విజయ్ తదితరులు ఉన్నారు.

## దశాబ్ది ఉత్సవాల పేరిట తెలంగాణ సంపాదన దోచుకున్నారు..

**రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డ జిల్లా ఇంఛార్జి నాగశిరోమణి**



**అలంపూర్,జూన్ 22 ప్రభాతవార్త :** పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా. ఎ. సంపత్‌కుమార్ పిలుపు మేరకు జోగులాంబ గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక్షస పాలన సాగిస్తున్న కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి నాగశిరోమణి మాట్లాడుతూ దళితబంధు ఏమైందని, రైతు రుణమాఫీ ఎక్కడ ఉద్యోగుల భర్తీ ఎక్కడ, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఏవని, ఇంటికో ఉద్యోగం ఎక్కడ అని నిలదీశారు. గత 9 సంవత్సరాల నుండి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారు తప్ప మీరు సాధించింది ఏమి లేదని ఏ ఒక్క రంగాన్ని కూడా మీరు అభివృద్ధి చేయలేరు మళ్లీ మీరు ప్రజలను మభ్యపెట్టడానికి వీధిలోకి వచ్చి ప్రజలను మోసం చేయడానికి నాటకాలు ఆడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ బిజెపి పార్టీ రెండు ఒకటేనని తెలిపారు. నాలుగు నెలల్లో ఎన్నికలు ఉన్నాయని ఇప్పుడు మీకు తెలంగాణ ఉద్యమకారులు గుర్తుకొచ్చారు. ముఖ్యంగా రైతులకు విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయండని అన్నారు.

# నరేంద్రమోడీ సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలి..!

**అంత్యోదయ స్ఫూర్తితో అనేక సంక్షేమ పథకాలను చేపట్టి మోడీ ప్రభుత్వం**

**రైతుల సంక్షేమానికి పెద్దపీట నరేంద్రమోడీ ప్రభుత్వం**



మాజీ ఎంపి, బిజెపి జాతీయ ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి నిఖిల్ ఆనంద్‌కు పుష్పగుచ్ఛ అందజేస్తున్న దృశ్యం



సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తున్న బిజెపి నాయకులు

**గద్వాల ప్రతినిధి,జూన్ 22 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా 36వ వార్డులో ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి బిజెపి కరపత్రాలను, డోర్ స్టిక్కర్లను ప్రారంభించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ పథకాలను మాజీ ఎంపి, బిజెపి జాతీయ ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి నిఖిల్ ఆనంద్ వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి, బిజెపి జాతీయ ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి నిచల్ ఆనంద్ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి నరేంద్రమోడీ తొమ్మిది ఏళ్ల సుపరిపాలన, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రధానమంత్రి మోడీ గత 9 సంవత్సరాలుగా అంత్యోదయ స్ఫూర్తితో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన ద్వారా 80 కోట్ల మందికి ఉచిత ఆహార పంపిణీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా మూడుకోట్ల పేద కుటుంబాలకు పక్కా ఇల్లు ఇచ్చారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం భారతదేశంలో ప్రతి సంవత్సరానికి లక్ష కోట్ల రూపాయలు మోదీ ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 12కోట్ల మంది రైతులకు ఏడాదికి ఆరువేల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తున్నారని అన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచితంగా 5లక్షల రూపాయలు వైద్య సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. తెలంగాణలో కెసిఆర్ బిజెపికి పేరు వస్తుందని అనేక పథకాలు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డికె స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకటరాములు, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మీర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు ఆనంద్, 36వ వార్డు కౌన్సిలర్ రజక జయశ్రీ, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి..!

**- డీసీసీ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి**

**- బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాలకు నిరసనగా దేవరకద్రలో కాంగ్రెస్ ఆందోళన**



దేవరకద్ర జరిగిన నిరసనర్యాలిలో డీసీసీ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దేవరకద్ర,జూన్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల పేరిట దరిద్రపు ఉత్సవాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు. దేవరకద్రలో గురువారం దశాబ్ది ఉత్సవాల పేరుతో ముఖ్యమంత్రి దగా చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌రెడ్డిలతో కలసి మధుసూధన్‌రెడ్డి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకొని పెద్దఎత్తున నిరసన ర్యాలి నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి డీసీసీ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి ప్రసంగించారు. నీళ్ళు, నియమకాలు, ఆత్మగౌరవం అనే నినాదంతో ఏర్పాటు చేసుకొన్న తెలంగాణ రాష్ట్రంలో ఆ నాలుగు అంశాలను తుంగలో తొక్కి తెలంగాణ ప్రజల ఆశయాలను అడియాలు చేశారన్నారు. తొమ్మిదేళ్ళుగా నిర్వీర్యం చేస్తూ మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

**తప్పులను కప్పిపుచ్చుకొంటున్న ప్రభుత్వం:కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్**

కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి దశాబ్దం కాకముందే దశాబ్ద ఉత్సవాల పేరిట తెలంగాణ దరిద్రపు ఉత్సవాలు చేస్తున్నారని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను నాశనం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారని విమర్శించారు. మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని గ్రహించి ఉత్సవాల పేరిట రోజుకొక అంశాన్ని నెత్తినవేసుకొని కొత్త వేశాలు వేస్తున్నారని ఆరోపించారు.

**అరచేతిలో వైకుంఠాన్ని చూపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం: కొండ ప్రశాంత్‌రెడ్డి**

కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి ప్రసంగిస్తు బీఆర్ఎస్‌ది దగాపాలన అన్నారు. అరచేతిలో వైకుంఠాన్ని చూపుతూ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రజల డబ్బులను వృధాచేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలను మోసం చేస్తుందన్నారు. అనంతం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చాలని స్థానిక తహశీల్దార్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వీర్లపల్లి శంకర్, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లెపోగు ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షుడు కుర్వరాందాసు, రాఘవేందర్‌రెడ్డి, కిషన్‌రావు, ఫారూఖ్, కేబీఆర్‌గౌడ్‌లతో పాటు దేవరకద్ర నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి మోడీ సంక్షేమ ఫలాలు:బీజేపీ నేత శ్రీకాంత్ భీమా



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**అచ్చంపేట, జూన్ 22 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాల్లో దేశ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించేందుకు జూన్ 22 నుంచి 30వ తేదీ వరకు బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఉప్పునుంతల మండల కేంద్రంలో మోడీ సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి బీజేపీ నేత దేవని సతీష్ మాదిగ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, తడి పొడి చెత్తను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్, రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటించడం, డంపింగ్‌యార్డ్, రైతు వేదిక, ఉద్యానవనం లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ నిధులచే నిర్మించడమైందని ఆయన పేర్కొన్నారు. ప్రతి మనిషికి రేషన్ షాపుల్లో రూ.5కిలోల బియ్యం ఉచితంగా అందిస్తూ ప్రతి ఎకరాకు రూ.8వేలు విడతల వారిగా నాలుగుసార్లు రైతు ఖాతాల్లో జమ చేస్తూ రైతు బంధావుడిగా నరేంద్రమోడీ నిలిచారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్, సురేందర్‌రెడ్డి, మహేష్, సుల్తాన్, కిట్టు, శంకరయ్య, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

**వంగూరులో....** వంగూరు మండల కేంద్రంలోని శ్రీ గెల్వాలంబ మాత ఆలయంలో అచ్చంపేట బీజేపీ నేత దేవని సతీష్ మాదిగ ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారం చేపట్టి మోడీ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భాస్కర్, సైదులు, కొండల్‌రెడ్డి జగన్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## దేశాన్ని అగ్రగామిగా నిలిపిన మహనేత మోడీ

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు**



బిజెపి పథకాలను ఇంటింటికి వివరిస్తున్న బిజెపి నాయకులు

**చిన్నచింతకుంట,జూన్ 22 ప్రభాతవార్త :** ప్రపంచంలోనే దేశాన్ని అగ్రగామిగా నిలిపిన మహనేత నరేంద్రమోడీయని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు అన్నారు. గురువారం మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా ఇంటింటికి బిజెపి కార్యక్రమం మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. రైతు సంక్షేమంతో పాటు మహిళల భద్రత సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికై ఎన్నో వినూత్న పథకాలను తీసుకొచ్చారన్నారు. అవినీతి లేని పాలన అందించి ప్రపంచంలోనే దేశాన్ని గౌరవ స్థానంలో ఉంచిన రాజనీతిజ్ఞుడు నరేంద్రమోడీయని ఆయన కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి అవకాశం ఇవ్వాలని, బంగారు తెలంగాణ పేరిట దోచుకుంటున్న కెసిఆర్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు ఎర్రవెంకటన్న, మండల అధ్యక్షులు దశరథ్, నాయకులు ఆకుల అంజన్న, దాసరి చంద్రుడు, గంజి ఎంకన్న, మనోహర్, వికాస్, నరసిహ, లంకాల రవి, మన్యం, దయాసాగర్, రమేష్, శ్రీను, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులకు నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపిపి

**ఇటిక్యాల,జూన్ 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరిరోజు గురువారం అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి స్నేహ శ్రీధర్‌రెడ్డి, ఎంపిడిఓ రాఘవ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశమై అమరవీరులకు 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాఘవ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో ప్రతి కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేశారని వారిని అభినందించారు. అంతేకాక ప్రభుత్వం ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతం చేసినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజు, ఎస్సై గోకారి, ఆర్ఐ సుదర్శన్‌రెడ్డి, సూపరింటెండెంట్ రమాదేవి, జూనియర్ అసిస్టెంట్లు అనిత, శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## వర్షంకోసం 501 టెంకాయతో అమ్మవారికి ఆర్‌వి.శేషు



సమృద్ధిగా వర్షాలు కురవాలని కొబ్బరికాయలు కొడుతున్న దృశ్యం

**అలంపూర్,జూన్ 22 ప్రభాతవార్త :** అలంపూర్ రైతన్నకు సంపూర్ణమైన వర్షాలు కురిసి సిరిసంపదలు కలగాలని ఐదవ శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని యూత్ ఫర్ పబ్లిక్ టీం 501 కొబ్బరికాయలు కొట్టారు. రైతులు ఆర్డీఎస్ మీదనే ఆధార పడకుండా సంపూర్ణమైన వర్షాలు కురవాలని భగవంతుని సన్నిధిలో ఆర్.వి శేషు అన్నారు. సకాలంలో వర్షాలు కురవాలని రైతన్న తరపున వరుణదేవుడు ఈ సంవత్సరం నిలబడాలని కోరుతూ 501 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో రైతులు బి. రాముడు, కె. రాముడు, ఆదాము, రాజన్న, వెంకటేష్, వి. బ్రహ్మయ్య, రియాజ్, భాష, తిమ్మప్ప, బాష, ఎస్.ఆదాము, చంద్రయూత్ ఫర్ పబ్లిక్ మెంబర్స్ శివకుమార్, రాజు, బి.రాజు పాల్గొన్నారు.

## అమరుల ఆత్మశాంతి కోసం మౌనం



**మల్దకల్, జూన్ 22 ప్రభాతవార్త :** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అమరవీరుల స్తూపం ప్రారంభ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అసువులు బాసిన అమర వీరులను స్మరించుకుని వారి ఆత్మకు శాంతి చేకూరాలని అధ్యాపకులు, విద్యార్థులు రెండునిమిషాల పాటు మౌనం పాటించారు. అదేవిధంగా అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. ఇంఛార్జి ప్రిన్సిపాల్ కె.నరసింహులుగౌడ్, తిమోతి, జయరాం, శ్రీనాథ్, ఆంజనేయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లి పాఠశాలలో పేరెంట్ మీటింగ్ నిర్వహణ



**ఉట్కూర్,జూన్ 22 ప్రభాతవార్త :** మన ఊరి పిల్లలందరు మన ఊరి బడిలోనే చదువుకోవాలని గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మాణం ఉట్కూర్ మండల పరిధిలోని అవుసలోనిపల్లి గ్రామంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 70కి చేరిందని ఊరికి ప్రైవేట్ వాహనాలు రాకూడదని గ్రామస్తులు సమిష్టి నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ అమరుల దినాన్ని పురస్కరించుకుని అమరుల నివాళిలో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయురాలే శ్వేత, పంచాయతీసెక్రటరీ సాయినాథ్ గ్రామసర్పంచ్ శాంతమ్మ, ఉపసర్పంచ్ అంజమ్మ, వార్డుమెంబర్లు రామాంజనేయులు, గ్రామపెద్దలు, యువకులు, విద్యాకమిటిఛైర్మన్ చిన్న నర్సింలు విద్యాకమిటి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అమరవీరులకు నివాళులర్పించిన ఎంపిపి



**ధరూర్,జూన్ 22 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శతాబ్ది ఉత్సవాలలో భాగంగా అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపిపి నజీమున్నిసాబేగం, జడ్పీటిసి పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఎంపిడిఓ అబ్దుల్ జబ్బార్, ఎంఈఓ సురేష్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సిబ్బంది నివాళులర్పించారు. ఎంపిపి నజీమున్నిసాబేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరులకు నివాళులర్పిస్తూ తీర్మాణం ప్రవేశపెట్టి తీర్మాణాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

## 1 లక్ష 25 వేలు రూపాయలు ఎల్ఓసి లెటర్ అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల ప్రతినిధి,జూన్ 22 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండల పరిధిలోని జిల్లేడు బండ గ్రామానికి చెందిన శ్రీలత తండ్రి కృష్ణన్నకు మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 1 లక్ష 25 వేల ఎల్ఓసి లెటర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటిసిలు ప్రభాకం రెడ్డి, రాజశేఖర్, సర్పంచ్ వాసు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, కురుమన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చైనా బజార్‌ను ఎత్తివేయాలి

- పాత బస్టాండ్‌ను ప్రారంభించాలి
- నిరుపేదల పూల షాపు వారికి ఉపాధి కల్పించాలి
- అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్



మేకల అశోక్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమిస్తు నియామకపత్రం అందజేస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్

**వనపర్తి టౌన్, జూన్22, ప్రభాతవార్త:** చైనా బజారును ఎత్తివేసి, పాత బస్టాండ్‌ను ప్రారంభించాలని అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీరంగాపురం మండలం నుండి కొందరు నాయకులు అచల పక్ష ఐక్యవేదికలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అచలపక్ష ఐక్యవేదిక పోరాటాలు నచ్చి మేము చేరుతాము అని చెప్పిన వెంటనే వారి నాయకుడు మేకల అశోక్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమిస్తు నియామకపత్రం జారీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. త్వరలో శ్రీరంగాపురం మండలంలో పెద్ద ఎత్తున అచలపక్షంలో చేరుతామని అక్కడ ఒక సమావేశం ఏర్పాటు చేసి మండల కమిటీ ఏరానపటుతో గొప్ప కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్‌ను ఓపెన్ చేయాలని, ఇంతకుముందు పలుమార్లు పోరాటాలు చేశామని, పేదల షాపులు తీశారు కానీ కార్పోరేటర్ సంస్థ అయిన చైనా బజార్‌తో కుమ్మక్కై అదితీయడం లేదని, వారితో పైసలు తిన్నవారు తిరిగి ఇవ్వవలసి వస్తుందని దానిని తీయడం లేదని , వెంటనే తీసివేయాలని లేని యెడల త్వరలో వనపర్తి పట్టణం బంద్ ప్రకటించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అక్కడున్న పూల షాపు వారికి 10/12 డబ్బాలు ఏర్పాటు చేసి మున్సిపాలటీ నుండి నామినల్ రెంటుకు వారికే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ , మంత్రి వెంటనే చర్యలు తీసుకుని పాత బస్టాండ్ ఓపెన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ యాదవ్‌తో పాటు ఉపాధ్యక్షులు జానంపేట రాములు, సత్యం,నీరడి,ఆనంద్,నగేష్,శటమోనిఅశోక్,ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# నాగసానిపల్లి బీటీ రోడ్డు పనులు ప్రారంభం



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాగసానిపల్లి సర్పంచ్ ఆంజనేయులు నాయుడు

**శ్రీరంగాపురం, జూన్22, ప్రభాతవార్త:** నాగసానిపల్లి నుండి వెంకటాపురం వరకు బీటీ రోడ్డును నాగసానిపల్లి సర్పంచ్ ఆంజనేయులు నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... నాగసానిపల్లి గ్రామం నుండి వెంకటాపురం వరకు రోడ్డు సరిగా లేక గ్రామ ప్రజలు ఎంతో కాలం ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, వెంటనే స్పందించిన మంత్రి బీటీ రోడ్డును మంజూరు చేయించారని తెలిపారు. గతవారంలోనేఈ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారన్నారు. మంజూరు అయిన వెంటనే మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గురువారం బీటీ రోడ్డు పనులు ప్రారంభం కావడం జరుగుతుందని గ్రామానికి మంత్రి ఎన్నో అభివృద్ధి పనులు మంజూరు చేశారని, మంత్రి నిరంజన్‌రెడ్డికి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రమేష్ నాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవిత,గ్రామస్తులు చిరంజీవి పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వే నిర్వహించిన ప్రజా సంఘాల నాయకులు



**వీపనగండ్ల, జూన్22, ప్రభాతవార్త:** బుధవారం ప్రజా సంఘాల నాయకులు వీపనగండ్ల మండల కేంద్రంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజా సం ఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు.వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన మీ ఇంటికి తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పేద మధ్య తరగతి కుటుంబాలకు అర్హులైన పేదవాళ్లకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని, అర్హులైన వారికి దళితబంధు ఇవ్వాలని, స్వంత స్థలం ఉన్న వారికి ఇల్లుకట్టుకోవడానికి 10 లక్షలు ఇవ్వాలని అన్నారు.ఈ సర్వే కార్యక్రమంలో రైతుసంఘంనాయకులు ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ, నవీన్,సీఐటీయు నాయకులు రామన్‌గౌడ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# కందూరు రామలింగేశ్వర స్వామి దేవాలయానికి విరాళంగా గ్రానైట్ అందజేత



**అడ్డాకుల, జూన్22, ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం కందూరు గ్రామ శివారులో దక్షిణ కాశీగా పేరు పొందిన శ్రీకందూరి రామలింగేశ్వర దేవస్థానం నందు దాతలు దొబ్బలి రామచందర్, పాలకమండలి సభ్యుడు దొబ్బలి రామకృష్ణ వారి తండ్రి కీ.శే. దొబ్బలి కొండన్న జ్ఞాపకార్థం కందూరి రామలింగేశ్వర దేవాలయ ముఖ ద్వారాల ముందు మెట్లకు నందీశ్వరుని ముందు భాగంలో మెట్లకు ప్రధాన దేవాలయం ముందు ఉన్న మెట్లకు దాదాపు రూ. 2 లక్షల వ్యయంతో గ్రానైట్ వేయడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్ తెలిపారు.

# ఘనంగా అమరులకు నివాళులు

**అడ్డాకుల, జూన్22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు నాగార్జున రెడ్డి, ఎంపీడీవో మంజుల, ఎంపీవో విజయకుమారి, సూపరింటెండెంట్ శివ ప్రసాద్,సింగిల్‌విండో అధ్యక్షులు జితేందర్‌రెడ్డి,డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, మండల కోఆప్షన్ సభ్యులు ఖాజాగోరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇంటింటికి మోడీ సంక్షేమ ఫలాలు

- బీజేపీ జిల్లా కార్యదర్శి పరుశురాం
- ఇంటింటికి బీజేపీ సంక్షేమ పథకాల కరపత్రాల పంపిణీ



ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తి టౌన్, జూన్22, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీ 9 ఏళ్ల పాలనలో సేవా, సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం 4వ వార్డులో కుమ్మరి వీధిలో ఇంటింటికి బిజేపీ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి పరుశురాం మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోడీ చేసిన సంక్షేమ ఫలాలు నేషనల్ హైవేస్ ఇల్లు లేని నిరుపేదలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన అమలు నిరుపేదలకు రేషన్ బియ్యం, అంగన్వాడీ సెంటర్లకు కేంద్ర ప్రభుత్వం ద్వారా పౌష్టిక ఆహారం బీసీ కులాల మత్స్యకార సహకార సంఘానికి గొర్రెల కాపరులకు కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 14 ఫైనాన్స్ 15 ఫైనాన్స్ కింద మున్సిపాలిటీలకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు వీధి లైట్లు హరితహారం స్మశాన వాటిక అన్ని సంక్షేమ పథకాలకు మోడీ నిధులు విడుదల చేస్తే తెలంగాణ ప్రభుత్వం మేమే నిధులు విడుదల చేస్తున్నామని చెప్పుకొని వారి పేర్లు పెట్టుకుంటూ తిరుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషప్రచారాన్ని ఇంటింటా ఈ పథకాలన్నీ మోడీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సురేందర్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి సుగూరు రాములు, బూత్ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ, బీజేపీ సీనియర్ నాయకుడు సూగూరు శ్రీనివాసులు, బోలెమోని రాములు, దంతిశ్వర్, బీజేవైఎం నాయకులు నరేందర్, శివకుమార్ గుణగంటి అంజి తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటికి బీజేపీ:** జిల్లా కేంద్రంలోని 5,19,20వ వార్డులలో ప్రధాని మోడీ 9 ఏండ్ల పాలనలో సాధించిన ప్రగతిని చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం,దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమార్,బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్,ఓబీసీ మోర్చా పట్టణ మీడియా సెల్ కన్వీనర్ రవిసాగర్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి శివసాగర్, సీనియర్ నాయకులు బాబురావు, సుబ్రహ్మణ్యం,నారాయణ, కురుమూర్తి, రవి, బూత్ అధ్యక్షులు శివ యాదవ్, భరత్, సందీప్ నాయుడు, మహేష్ గౌడ్,ఎద్దుల గోపాల్,చిన్న,రాజేష్, ప్రశాంత్,రాజు, శివయాదవ్, పవన్ కుమార్, అరవింద్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

– భారతీయ జనతా పార్టీ భారత ప్రధాని నరేంద్రమోడీ 9 ఏళ్ల పాలనలో సేవా, సుపరిపాలన, పేదల సంక్షేమమే ధ్యేయంగా 24వ వార్డు బీజేపీ అభ్యర్థి గజరాజుల తిరుమలేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం ప్రధాని నరేంద్రమోడీ చేసిన సంక్షేమ ఫలాల గురించి రైతుల సంక్షేమానికి పెద్దపీట, మహిళా సాధికారిత , భారతదేశ అమృతకాల భావితర స్వశక్తికరణ, అందరికీ ఆరోగ్యమైన జీవితం, మధ్యతరగతికి సులభతర జీవితం, స్వశక్తి భారతదేశం, మౌలిక సదుపాయాల అపూర్వ వృద్ధి, ఈశాన్య రాష్ట్రాల చారిత్రక అభివృద్ధి,సంస్కృతి వారసత్వంలో కొత్త శకం అమలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ సంస్థాగతంగా కన్వీనర్ కేతూరి బుద్దన్న, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సూగూరు రాములు, 11వ బూత్ అధ్యక్షులు రాఘవేంద్ర సాగర్, బూత్ యువ కార్యకర్త ఇంచార్జీ నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట

# ప్రజలను దగా చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

◆ మాజీ మంత్రి చిన్నారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

**వనపర్తి టౌన్, జూన్22, ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట తెలంగాణ ప్రజలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తున్నదని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. వనపరినత జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి చిన్నారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత మా ప్రభుత్వం మాటల చెప్పరామికమైందని ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాలతో ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని ఆర్డీవో కార్యాలయం వద్ద పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కేజీ టు పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్య, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ,ఇంటికో ఉద్యోగం ఇస్తానని ఎన్నికల హామీ ఇచ్చి, కనీసం ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని, నిరుద్యోగ యువకులు ఉద్యోగాలు రాక ఇబ్బందులకు గురవుతుంటే వారికి నిరుద్యోగ భతి ఇస్తానని ఏమైందని ఆయన ప్రశ్నించారు. రైతులకు లక్ష రూపాయలరుణమాఫీ, ఉచిత ఎరువుల సరఫరా, 12 శాతం ముస్లీం రిజర్వేషన్, 12 శాతం గిరిజనులకు రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, పీసీసీ డెలిగేట్ కిరణ్ కుమార్, బీసీసెల్ అధ్యక్షుడు కోట్ల రవి, మత్స్యకార కమిటీ జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ నాయకులు గంజాయి రమేష్, దేవన్న యాదవ్, కదిరె రాములు, బొంబాయి మన్యంకొండ, చీర్ల జనార్ధన్, ఎల్లన్న, దివాకర్ యాదవ్, రాగి అక్షయ్, బాబా, నాగరాజు శివ, నరేందర్, రోహిత్, దిలీప్, భాస్కర్,శివ, జానకి రాములు, వెంకటేష్, ఆసిఫ్ మియా, నరసింహ, తిరుపతయ్య,నాగార్జున,నరేష్, వెంకటేష్, లీలావతి, చిట్టెమ్మ, విజయ్‌కుమార్, నాగేందర్‌గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణయ్య యాదవ్,దేవన్నయాదవ్, బాలరాజు, దేవిజా నాయక్, ప్రతాప్ నవీన్‌రెడ్డి, యాదయ్య,అనిల్ కుమార్, దుర్గయ్య, శ్రీనివాసులు, అజీమ్, బీరయ్య, రాజేందర్ గౌడ్,ఉపేందర్,విజయవర్ధన్‌రెడ్డి,చంద్రశేఖర్,శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, పెంటన్నయాదవ్,గట్టుమన్యం, గట్టు రాజు, మనిగిల్ల సురేష్, రఘు, భీమ్ నాయక్, వహీద్, అతిక్, రమేష్ గౌడ్, బి.రాములు యాదవ్,రాములు, గోవిందు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్,భీమన్న,గంగాధర్, మద్దిలేటి, రామరాజు, బోయ కురుమన్న, వెంకటేష్, అశోక్, సురేందర్ యాదవ్, కిట్టు, రఘు, బోయ రవి, శ్రీనివాసులు, ఇమ్రాన్, బొక్కలయ్య, విష్ణు,పురుషోత్తం,వెంకటస్వామి,ఎల్లయ్య,మహేష్,నవీన్, అనిల్, జావిద్,మొయిజ్,వెంకట్‌నారాయణ,కురుమూర్తికొండన్న,గొల్ల రాములు, వెంకటయ్య,శివయ్య, శ్రీను,ధర్మోజీ రావు, కావలి బాలు, బాల రాజు, పర్వతాలు,సురేష్,మధుయాదవ్, మల్లేష్,పరుశరాములు,శాంతన్న, రామచందర్, కేశవులు,నరహరి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నాగన్న గౌడ్, ఎల్లగౌడ్, మధు, ప్రవీణ్ కుమార్, ప్రేమ్,ఏదుట్ల రాములు, రాజు పాల్గొన్నారు.

# ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం



అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్న నాగసానిపల్లి సర్పంచ్

**శ్రీరంగాపురం, జూన్22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం నిర్వహించిన అమరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచుల ఆధ్వర్యంలో వినీల రాణి కురుమయ్య, నాగసానిపల్లి ఆంజనేయులు నాయుడు, నాగరాల నిర్మల రాధాకృష్ణ,కంబాలాపూర్ ఎద్దుల మంజుల రాజవర్ధన్‌రెడ్డి, తాటిపాముల సత్యం యాదవ్, జానంపేట వెంకటేశ్వర్‌రెడ్డి,శేరుపల్లి సునిత రాజశేఖర్, వెంకటాపూర్ నాగన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో చివరి రోజు గురువారం తెలంగాణరాష్ట్రం కోసం తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడి ప్రాణాలు అర్పించినఅమరవీరులకుసంస్మరణ దినోత్సవాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలకు వెలకట్టలేమని, వారి రుణాన్ని తీర్చుకోలేమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి అన్ని రంగాలలో దేశంలోనే అగ్రగామిగా ముందుకు దూసుకెళ్తుందని, ఇటువంటి అభివృద్ధి సాధించినటువంటి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలో మొదటి స్థానం సాధించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల ఉప సర్పంచులు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్రీయ నవోదయ విద్యాలయానికి ఎంపికైన కూన రోహన్



**వెల్దండ, జూన్ 22 ప్రభాతవార్త:** జవహర్ లాల్ నవోదయ పరీక్ష ఫలి తాల్లో వెల్దండ మండల కేంద్రానికి కూన రోహన్ వట్టెం నవోదయ విద్యా లయంలో 6వ తరగతిలో సీటు కైవసం చేసుకున్నారు. తల్లిదండ్రులు కూన శ్రీనివాసులు పద్మ దంపతులతో పాటు గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు విద్యార్థి కూన రోహన్‌ను అభినందించారు.

# రైతుబంధుకు ధరఖాస్తు చేసుకోవాలి

**వెల్దండ, జూన్22 ప్రభాతవార్త:** కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబంధుకు ధరఖాస్తు చేసుకోవాలని ఏఓ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబంధు వర్షకాలం మొత్తం 18284మంది రైతులకురూ.23,28,44కోట్లు మంజూరైందని, 16-06-2023 వరకు కొత్తగా పాసు బుక్ వచ్చిన రైతులు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుబంధు ధరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను సంబంధిత ఏఈఓకు అందించాలన్నారు.

# విద్యుదాఘాతానికి గొర్రె మృతి

**వెల్దండ, జూన్ 22 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కావటి వీరయ్యకు చెందిన గొర్రె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినది. తన గొర్రెలను వ్యవసాయ పొలానికి తీసుకెళ్తుండగా గ్రామంలో ఏర్పాటు చేసిన సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేయకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదం చోటు చేసుకుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

# ఊరేసుకొని వ్యక్తి మృతి

**వెల్దండ, జూన్ 22 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన దత్తం రమేష్ (32) గురువారం ఉదయం ఇంటి ఆవరణలో ఊరేసుకొని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...దత్తం రమేష్ హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఈ మధ్య కాలంలో వెల్దండ స్వగ్రామానికి వచ్చాడు. ఉదయం సమయంలో ఇంట్లోఎవరు లేని విషయాన్ని గ్రహించి చెట్టుకు ఊరేసుకొని మృతి చెందాడు.

# అర్చకులకు ఆర్డర్ కాపీలు అందజేత



దూప, దీప నైవేద్యంలో భాగంగా అర్చకులకు ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, జూన్ 22 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోదశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని కల్వకుర్తి, వెల్దండ మండలాలకు సంబంధించి 11 మంది దూప, దీప నైవేద్యంలో భాగంగా ఆలయ అర్చకులకు అర్డర్ కాపీలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ అన్ని మతాల వారికి తగు ప్రాధాన్యత ఇస్తున్నారని, దీప, దీప నైవేద్యం రూ.6వేల నుంచి రూ.10వేల వరకు పెంచడమే హర్షణీయమన్నారు.తెలంగాణరాక ముందు దేవాలయాలుఎలా ఉనా న్న యో నేడు ఎన్నా ఉన్నాయో గమనించాలన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వెల్దండ గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, కౌన్సిలర్ సూర్యప్రకాష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు బావండ్ల మధు, కుడుముల మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరుల ఆత్మశాంతి కోసం మౌనం

**మల్దకల్, జూన్22 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అమరవీరుల స్తూపం ప్రారంభ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అసువులుబాసిన అమరవీరులనుస్మరించుకుని వారిఆత్మకుశాంతి చేకూరాలని అధ్యాపకులు,విద్యార్థులు రెండునిమిషాల పాటుమౌనం పాటించారు. కార్యక్రమంలోఇంఛార్జి ప్రిన్సిపాల్ కె.నరసింహులుగౌడ్,తిమోతి ,జయరాం,శ్రీనాథ్,ఆంజనేయులు,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ

## అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్సీ ఘన నివాళులు



**కల్వకుర్తి, జూన్22 ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా సీఎం కేసీఆర్ నిర్మించిన అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ 9ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆకాంక్షిస్తూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న దృశ్యం

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఉద్యమంలో అమరుడైన కల్లెపల్లి కృష్ణయ్య కుటుంబ సభ్యులను, కృష్ణయ్య కుటుంబ సభ్యులను ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్ సుధాకర్‌లతో పాటు అధ్యాపక బృందం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం 1250 మంది అమరులయ్యారని, అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. తెలంగాణ అమరుల జ్ఞాపకార్థం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సదానందంగౌడ్, వేణు, మల్లేష్, పరుశరాం, భీమేష్, మల్లేష్, రాజేష్, బాలరాజు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



కృష్ణయ్య కుమారుడిని సన్మానిస్తున్న దృశ్యం

**పీఏసీఎస్ కార్యాలయంలో:** త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ 9ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆకాంక్షిస్తూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో అరు మలైన కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతని కుమారుడును శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపి కను బహుకరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్యాం, డైరెక్టర్లు రామునాయక్, కృష్ణగౌడ్,వెంకటయ్య,ఫరీద్, సీఈఓ వెంకట్‌రెడ్డి, సహరసంఘం నాయకులు దాసు, దుర్గయ్య, రాంసాగర్, దుర్గయ్యసాగర్, సంఘం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

**వెల్దండ, జూన్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ అవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని అన్ని గ్రామాలతో పాటు వెల్దండ గ్రామ పంచాయతీలోని కార్యాలయఆవరణలో గురువారం అమరవీరుల స్థూపానికి సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ 6 దశాబ్దాల పోరాటం, ఎన్నో ఉద్యమాలు, ప్రజల అకాంక్షకు నిలువెత్తు నిదర్శనం, త్యాగాల ప్రతిరూపమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం. ఉద్యమంలో ఎంతో మంది పాల్గొని అసువులు బాసారు. వారందరిని స్మరించుకుంటూ అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్, మత్స్యకార సంఘం జిల్లా డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్య,ఉపసర్పంచ్ జంగిలినిరంజన్,కోఆప్షన్ సభ్యులు ఎండీ.అలీమ్ ,ప్రధానోపాధ్యాయులు అంజయ్య,నాయకులు భయ్యమల్లయ్య, జైపాల్‌రెడ్డి,పుష్పలత, శేఖర్,మట్ట శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్ తదితరులు ఉన్నారు.



**వీపనగండ్ల, జూన్22, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరుల దినోత్సవం జరుపుకున్నారు. ఎంపీడీవో కథాలప్ప ఆధ్వర్యంలో తెలంగాణ అమర వీరుల దినోత్సవం జరిపారు. ఎంపీడీవో కథాలప్ప మాట్లాడుతూ... అమరవీరులత్యాగ ఫలితం వలనతెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాండు నాయక్, మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, వ్యవసాయ అధికారులు, ఎంపీపీ కమలేశ్వర్‌రావు,సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.



**దేవరకద్ర, జూన్ 22 ప్రభాతవార్త:** దేవరకద్రలో గురువారం అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా స్తానిక గ్రామపంచాయతీ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అమరవీరులకు రెండు నిముషాలు పాటు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ విజయలక్ష్మీ,ఈఓ సీత్యానాయక్,మున్నూరు బాల్‌రాజ్,యుగేందర్‌రెడ్డి,సత్తి,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఖిల్లాఘణపురం, జూన్22, ప్రభాతవార్త:** దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకటరమణ గ్రామస్తుల ఆధ్వర్యంలో తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం ఎందరో వీరుల త్యాగ ఫలితంగా నేడు తెలంగాణరాష్ట్రం ఆవిర్భవించిందని , అమరుల ఆశయాల సాధనయే తెలంగాణ సంక్షేమ పథకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవితేజ, ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు పేపర్ చెన్నయ్య , యాదగిరి, ఆంజనేయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## బాధితునికి ఎంపీపీ మేఘారెడ్డి ఆర్థిక సాయం



ఆసుపత్రిలో మేఘారెడ్డి తరపున కొండన్న కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న గట్టు యాదవ్

**పెద్దమందడి, జూన్22, (ప్రభాతవార్త):** మండల పరిధిలోని జగత్‌పల్లి గ్రామానికి చెందిన చెవ్వ కొండన్న అనే వ్యక్తి ఇటీవల మోటార్ సైకిల్‌పై నుండి కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇట్టి విషయాన్ని గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టు యాదవ్ మేఘారెడ్డి దృష్టికి కొండన్న ఆర్థిక పరిస్థితుల గురించి వివరించడంతో తక్షణమే స్పందించిన ఆయన రూ.20వేలు గట్టు యాదవ్ కు ఇవ్వగా గురువారం ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేలు బాధితుని భార్య లక్ష్మికి అందజేశారు. ఆపదలో ఆదుకున్న మేఘారెడ్డికి బాధితుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన మన్నకొండ అనే యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా అతని కుటుంబ సభ్యులకు కూడా మరో రూ.5వేలు ఇవ్వగా గట్టు యాదవ్ మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## అమరవీరుల ఆశయాలు అమలైనప్పుడే నిజమైన నివాళి

పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి





అమరవీరులకు నివాళులర్పిస్తున్న, మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేఘారెడ్డి

**పెద్దమందడి, జూన్22, (ప్రభాతవార్త):** అమరవీరుల ఆశయాలను అమలు చేసి నప్పుడే వారికి నిజమైన నివాళి చేకూరుతుందని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం పెద్దమందడి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ అమర వీరుల త్యాగాలను స్మరిస్తు మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలతో కలిసి అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసికాసేపు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింధూజ, ఎంపీడీవో అఫ్జలుద్దీన్, వైస్ ఎంపీపీ రఘుప్రసాద్, ఎంపీటీసీలు భారతి, వరలక్ష్మి, చెన్నమ్మ, కురుమయ్య, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు సత్యారెడ్డి, వెల్టూరు మాజీ సర్పంచ్ బాల చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు అభిమన్యురెడ్డి ఆర్థికసాయం



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలో హన్మగళ్ల రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం బీఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యురెడ్డికి తెలియడంతో వెంటనే కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ప్రకటించి రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈమేరకు అభిమన్యు యువసేన సభ్యులు గురువారం బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధుసమితి మండలఅధ్యక్షుడు హన్మగళ్ల నర్సింహులు, అభిమన్యు యువసేనఉపాధ్యక్షుడు సున్నం శ్రీనివాస్, హన్మంత్, పల్లె తిరపతి, రాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

## 40మంది ఎస్సైల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్22, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేస్తున్న 40 మంది ఎస్సైలను బదిలీ అయ్యారు. ఈమేరకు వారికి స్థానచలనం చేస్తూ జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీహెచ్ శ్రీకాంత్ ఎస్సైగా మహబూబ్‌నగర్ టూ టౌన్‌లో విధులునిర్వహిస్తుండగా డీఎస్‌బీకి అటాచ్‌చేశారు. ఎస్ బాల్‌రెడ్డి మహబూబ్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్ నుంచి డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌కు అటాచ్ అయ్యారు. బీసుజాత మహబూబ్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్ నుంచి డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌కు అటాచ్ చేశారు. ఎంఎ ఖాదీర్ జడ్చర్ల పోలీస్ స్టేషన్ నుంచివీఆర్‌నారాయణపేటకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. వై భాగ్యలక్ష్మిరెడ్డి భూత్పూర్ నుంచి డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌కు అటాచ్ చేశారు. జి భాస్కర్ రెడ్డి భూత్పూర్ పీఎస్ నుంచి డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌కు అటాచ్ చేశారు. ఎంఎ అజీజుల్లా మహబూబ్‌నగర్ డీఎస్‌బీ నుంచి వీఆర్ నారాయణపేటకు, ఎం శైలజ డీఎస్‌బీ మహబూబ్‌నగర్ నుంచి జోగులాంబ గద్వాల వీఆర్‌గా, ఏ అరుణ డీఎస్‌బీ అటాచ్‌డ్ టు డీసీఆర్‌బీ మహబూబ్‌నగర్ నుంచి వీఆర్ జోగులాంబ గద్వాలకు, బాలయ్య కంట్రోల్ రూం మహబూబ్‌నగర్ నుంచి వీఆర్ వనపర్తికి, పెద్ద అంజయ్య వీఆర్ మహబూబ్‌నగర్ నుంచి వీఆర్ నాగర్‌కర్నూల్, కే బద్రీనాథ్ మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి వీఆర్ వనపర్తికి, ఎండీ మిస్బాఉద్దీన్ వీఆర్ మహబూబ్‌నగర్ నంచి వీఆర్ వనపర్తికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కేసుజాత వీఆర్ టూటౌన్ మహబూబ్‌నగర్ నుంచి రెపట్రీయెటెడ్ టు వీఆర్ మహబూబ్‌నగర్‌కు, వల్లంపట్ల రమేశ్ వీఆర్ రూరల్ మహబూబ్‌నగర్ నుంచి రెపట్రీయెటెడ్ టు వీఆర్ మహబూబ్‌నగర్, ఎం గోపాల్‌మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌నుంచి వీఆర్ నాగర్‌కర్నూల్‌కు, జి విజయ్‌కుమార్ నాగర్‌కర్నూల్ పీఎస్ నుంచి డీఎస్‌బీ నాగర్‌కర్నూల్‌కు, ఖుర్షిద్ అలీ డీఎస్‌బీ నాగర్‌కర్నూల్ అటాచ్‌టు పీసీఆర్ నాగర్‌కర్నూల్, బబి సురేశ్ సీసీఎస్ నాగర్‌కర్నూల్ నుంచి డీఎస్‌బీ నాగర్‌కర్నూల్‌కు, మాణిక్య నాయక్ వీఆర్ నాగర్‌కర్నూల్ అటాచ్ టు పీసీఆర్ నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఏనాగరాజన్ సీసీఎస్ ఎన్‌జీకేఎల్ టు వీఆర్‌మహబూబ్‌నగర్, పగిడాల శ్రీనివాసులు తాడూరు పీఎస్ నాగర్‌కర్నూల్ నుంచి వీఆర్ మహబూబ్‌నగర్, ఎం శివనందం గౌడ్ బల్మూర్ పీఎస్ నుంచి వీఆర్ గద్వాల, ఈ రమన్‌గౌడ్ వీపనగండ్ల పీఎస్ టు డీఎస్‌బీ వనపర్తి, కేటీ మల్లేశ్ శ్రీరంగాపూర్ పీఎస్ వనపర్తి నుంచి వీఆర్ జోగులాంబ , వహీద్ అలీ బేగ్ పెబ్బేర్ పీఎస్‌నుంచి డీఎస్‌బీ వనపర్తి, ఏ వెంకటేశ్వర్ గౌడ్ సీసీఎస్ వనపర్తి నుంచి వీఆర్ నాగర్‌కర్నూల్, రుషికేశ్ పుడట్టు సీసీఎస్ వనపర్తి నుంచి వీఆర్ మహబూబ్‌నగర్, ఆర్ శేఖర్ మల్దకల్ పీఎస్ నుంచి వీఆర్ జోగులాంబగద్వాల, కేగోఖరి ఇటిక్యాల పీఎస్‌నుంచి వీఆర్ మహబూబ్‌నగన్‌కు, వెంకట్‌స్వామి కోదండాపూర్ పీఎస్ నుంచి వీఆర్ వనపర్తికి, ఎం సంతోష్ మానవపాడు పీఎస్ నుంచి వీఆర్ నారాయణపేట, ఎంఎ రషీద్ సీసీఎస్ జోగులాంబగద్వాల నుంచి వీఆర్ గద్వాలకు, కేశవరావు సీసీఎస్ గద్వాల నుంచి వీఆర్ జోగులాంబ గద్వాల అటాచ్ చేశారు. ఎన్ రమాదేవి సీసీఎస్ గద్వాల టువీఆర్ గద్వాల, ఎస్ అభిషేక్ రెడ్డి డీసీఆర్‌బీ జోగులాంబ గద్వాల అటాచ్‌టు మహబూబ్‌నగర్ రెపట్రియేటెడ్ టు వీఆర్ గద్వాల, సీ సురేశ్‌గౌడ్ నారాయణపేట పీఎస్ ఉంచి వీఆర్ నారాయణపేట, ఎం సుధామధూరి వీఆర్ నారాయణపేట నుంచి వీఆర్ మహబూబ్‌నగర్, టీ చంద్రశేఖర్ ఎస్సై 2 నారాయణపేట పీఎస్‌నుంచి వీఆర్ నారాయణపేట, ఏ విజయ్‌కుమార్ వీఆర్ నారాయణపేట నుంచి వీఆర్ మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని మహిళలు అభివృద్ధి చెందాలి: ఎంపీపీ సోమేశ్వరమ్మ, జడ్పీటీసీ వెంకటరమణమ్మ

**చిన్నంబావి, జూన్22, ప్రభాతవార్త:** చిన్నంబావి మండల కేంద్రంలోని మండల సమీకృత కార్యాలయ భవన నిర్మాణానికి చిన్నంబావి మండల ప్రజాప్రతి నిధులతో కలిసి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల వద్దకే పాలన అనే విధంగా ముఖ్య మంత్రి కేసీఆర్ మండలాలను విభజించి చిన్నంబావి మండలాన్ని నూత నంగా ఏర్పాటు చేసి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అలాగే భవ నాలను ఒకే దగ్గర ఏర్పాటు చేయడం ప్రజలకు ఒకే దగ్గర పని పూర్తి అయ్యే విధంగా 4 కోట్ల 70 లక్షలతో ఈ సమీకృత భవనాలను ఏర్పా టు చేయడం జరిగింది. ఈ భవనాలను త్వరగా పూర్తి చేయాలని కాంట్రా క్టర్‌కు తెలి పారు. అలాగే నీటి మునక గ్రామాలైన కాలూరు, అయ్యవారిపల్లి, కొప్పు నూరు, పెద్దమారూర్, బెక్కెంతదితర గ్రామాలలో శిథిలావస్థకు, కూలివ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పోయిన ఇండ్లకు గృహలక్ష్మి పథకం కింద 1000 ఇండ్లను మంజూరు చేస్తు న్న అని ఎమ్మెల్యే అన్నారు. అలాగే మహిళలకు మండల పరిధిలో మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ చేసి వారి భవనానికి 10 లక్షలను ఎస్డీఎఫ్ నిధులనుండి విడుదల చేయడం జరిగిందన్నారు. మహిళా సమాఖ్య భవనా నికి భూమిని ఉచితంగా ఇచ్చినపెద్దమారూర్ సర్పంచ్ గోవింద్ శ్రీధర్ రెడ్డిని ఎమ్మెల్యే బీరం అభినందించారు. మహిళలు సంక్షేమ పథకాలను ఉప యోగించుకుని అభివృద్ధి చెందాలని అన్నారు. మండల కేంద్రంలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని తెలిపారు. చిన్నంబావి మండలానికి తొందరలోనే బ్యాంకును కూడా తీసుకువస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి కేటీఆర్ సహకారంతో కొల్లాపూర్ నియోజక వర్గం అన్ని విధాల అభివృద్ధిలో ముందుందని అన్నారు. సీఎం కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం ఎంతో ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో పాటు చిన్నంబావి మండల ఎంపీపీ సోమేశ్వరమ్మ, జడ్పీటీసీ కేసిరెడ్డివెంకటరమణమ్మచిన్నారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, ఉమ్మడి మండలాల పార్టీ వ్యవహారాల ఇంచార్జీ పెద్దమారూర్ సర్పంచ్ గోవింద్ శ్రీధర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మధు నాయుడు, ఎమ్మార్వో, ఎంపీడీవో, అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

## దశాబ్ది ఉత్సవాల పేరిట మోసం చేస్తున్న ప్రభుత్వం

**కల్వకుర్తి, జూన్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలనలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కల్వకుర్తి పట్టణంలో అమరవీరుల స్థూపం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీలు నిర్వహించారు. దశాబ్ది దగా పేరుతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, 10 సంవత్సరాలు కాకుండా దశాబ్ది ఉత్సవాలు చేసుకోవడం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నిర్వహిస్తున్నారన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేస్తూ, నీళ్లు, నిధులు, నియామకాల నినాదంపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకుఏమి అమలు కాలేదన్నారు. మరోసారి గద్దెనెక్కేందుకు దశాబ్ది ఉత్సవాల పేరుతో అంగు అర్భాటాలు చేస్తున్నారు తప్ప మరోకటి కాదన్నారు.



కల్వకుర్తిలో నిరసన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమలు కానీ హామీలతో తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్న బీఆర్ఎస్ పార్టీని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నానియాదవ్, షాకేర్, శ్రీధర్‌రెడ్డి, అనిల్‌గౌడ్, గోపాల్, పుస్తకాల రాహుల్, బాలరాజు తదితరులు ఉన్నారు.

## ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**కల్వకుర్తి, జూన్ 22 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో తెలంగాణ దశాబ్ది అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయం ముందు ఉన్న తెలంగాణ తల్లి, అమరవీరుల స్థూపం వద్ద కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది విద్యార్థులు, యువతీ, యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణలో ఇప్పుడు మనమంతా స్వేచ్ఛ వాయువులను పిలుస్తున్నామని ఆయన అన్నారు. అమరులను స్మరించుకోవడమే కాకుండా వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేష్‌కుమార్, మార్కెట్ చైర్మన్ సింగం విజయ్‌గౌడ్, మాజీ



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు

చైర్మన్‌రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్ సూర్యప్రకాష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు బావండ్ల మధు, కుడుముల మనోహర్‌రెడ్డి, గిరియాదవ్, శ్రీశైలం, దారమోని గణేష్, ఎస్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న పోలీస్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్22, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల నిర్వహించిన రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను గురువారం ఎనిమిదో రోజు కొనసాగింది. ఈమేరకు ఎస్పీ నరసింహ కార్యాలయానికి చేరుకొని వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. టీఎస్ఎల్‌పీఆర్‌బీ నియమ, నిబంధనల మేరకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులసర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకుఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు తగుచర్యలు తీసుకోవాలని ఎస్పీఅధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలోని 500మంది అభ్యర్థులకుగానూ 446మంది అభ్యర్థులు హాజరయ్యారని, వారందరి ధ్రువపత్రాలు పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీరాములు, ఏవోరుక్మిణిబాయి, సాయుధ దళడీఎస్పీ శ్రీనివాసులు, సూరింటిండెంట్ యహోవాదాస్, ఐటీసెల్, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తికరం

- ప్రభుత్వ ఖర్చుతో ప్రజలకు మేలైన వైద్యం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి

**వనపర్తి వైద్య విభాగం, జూన్22, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తికరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షన కేంద్రాన్ని మంత్రి నిరంజన్‌రెడ్డి సందర్శించి బుధవారం ఒకే రోజు 28 కాన్పులు జరిగినటువంటి బాలింతలను పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో 50-60 డెలివరీల కన్నా మించేవి కావని, ఇప్పుడు నెలకు సగటున 450 డెలివరీలు జరుగుతున్నాయన్నారు. కొత్తగా మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభించాక ప్రభుత్వ చొరవతో ఇన్స్టిట్యూషనల్ డెలివరీస్‌పై దృష్టి పెట్టడం, కేసీఆర్ కిట్ ప్రారంభించడం ఆరోగ్యశాఖను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన తేవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చాలా గణనీయంగా పెరిగాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు కూడా ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చి వైద్య సేవలను



పొందడం చాలా సంతోషకరం అన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రజలు మధ్య తరగతి వాళ్లు గణనీయంగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందిన ప్రజలు వైద్య సిబ్బందిపై ఆరోగ్య సిబ్బందిపై చాలా సంతృప్తికరంగా ఉన్నారన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రకుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్‌కుమార్, గైనిక్ హెచ్‌వోడి డాక్టర్ కిరణ్మయి, ఆర్ఎంవోలు డాక్టర్ బంగారయ్య, డాక్టర్ ప్రభాకర్, ఎంసీహెచ్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కన్మనూరు ఉప సర్పంచ్‌ను పరామర్శించిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**అడ్డాకుల, జూన్22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కన్మనూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రాజవర్ధన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఎడమ చేతి విరిగిపోవడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం బాధితుని నివాసానికి వెళ్లి పరామర్శించి మనో ధైర్యమిచ్చారు. త్వరగా కోలుకోవాలని సూచించారు. కన్మనూరు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ చేసి గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. బలీదుపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ తొలగించి కొత్త పైపులైన్ వేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి వెంట సర్పంచ్ సుమతమ్మ, జిల్లా రైతుబంధు అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేణు యాదవ్, బలీదుపల్లి బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, కన్మనూరు రేషన్ డీలర్ భీమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం :జడ్పీ చైర్‌పర్సన్

**మొదటి పేజీ తరువాయి భాగం..** వారిని ఈ సందర్భంగా స్మరించుకోవడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ ఇంజనీర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రంగరెడ్డి, మోహన్‌రావులు మాట్లాడారు. అనంతరం పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అమరులైన పాశం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్ విగ్రహాల ఆవిష్కరణగావించి రెండు నిమిషాలు మౌనంపాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్‌నర్సింలు, శ్యాంప్రసాద్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి, రమేష్, మోహన్‌రావు, సంబంధితశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



పిడుగుపాటుకు మృతి చెందిన మహిళ

**మూసాపేట, జూన్ 22 ప్రభాతవార్త:** మూసాపేట మండల పరిధిలోని పోన్కంపల్లి గ్రామంలో గురువారం పిడుగుపాటుకు కుర్వ లక్ష్మమ్మ (28) అనే మహిళ మృతి చెందగా మరో మహిళ మాల లక్ష్మమ్మ అనే మహిళకు గాయాలయ్యాయి. పోల్కంపల్లి గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ కట్టడానికి గ్రామానికి చెందిన వీరస్వామి (30) అతని భార్య కుర్వ లక్ష్మమ్మ (28) వీరితో పాటు మాల నాగరాజు అతని భార్య మాల లక్ష్మమ్మ రోజువారి కూలీలుగా పనికి వెళ్లారు. గురువారం సాయంత్రం వర్షంరావడంతో చెట్ల కిందకు వెళ్లారు. పిడుగు పడి కురు లక్ష్మమ్మ (28) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ మాల లక్ష్మమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

### 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల కారణంగా

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం అప్పక్‌పల్లి 132 కెవి ఉపవిద్యుత్ కేంద్రంలో శుక్రవారం ఉదయం మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక ఏఈ మహమూద్ రఫీ ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ 132 కెవి ఉప విద్యుత్ కేంద్రం నుండి సరఫరా అయ్యే ఉప విద్యుత్ కేంద్రాలు నారాయణపేట పట్టణంతో పాటు, నారాయణపేట మండలం చిన్నజట్రం, కోటకొండ, సింగారం, పేరపళ్ల తదితర ఉప విద్యుత్ కేంద్రాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మహ్మద్ రఫీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

## బ్యాంకు అధికారుల ఒత్తిడితో రైతు మృతి?

**కోయిల్‌కొండ, జూన్ 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అభంగపట్టణం గ్రామానికి చెంది దుబాయ్ శంకరయ్య మృతికి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారులే కారణమని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం. రామునాయక్, మండల బిజెపి మాజీ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, దమాయపల్లి వెంకటేష్, మాడా రాజు ఆరోపించారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ బ్యాంకు అధికారులు బుధవారం అభంగపట్నం గ్రామానికి వెళ్లి దుబాయ్ శంకరయ్యను కలిసి మీరు మా బ్యాంకులో తీసుకున్న రుణాలు వెంటనే చెల్లించాలని లేకపోతే మీఆస్తులు జప్తుచేస్తామని భయభ్రాంతులకుగురి చేయడంతో గుండెపోటువచ్చి దుబాయ్ శంకరయ్య మరణించడం జరిగిందని వారు ఆరోపించారు. మృతుడు దుబాయ్ శంకరయ్య కుటుంబాన్ని జిల్లా సహకార కేంద్రబ్యాంక్ అధికారులేఆదుకుని న్యాయంచేయాలని వారు డిమాండ్ చేశారు.

**బ్యాంకు అధికారి వివరణ:** బ్యాంకులో తీసుకున్న రుణాలను చెల్లించాలని ప్రతి రైతు దగ్గరికి వెళ్లి అడగడం సర్వ సాధారణమేనని అందులో భాగంగానే దుబాయ్ శంకరయ్య ఇంటికి వెళ్లి బ్యాంకులో తీసుకున్న రుణాలు చెల్లించాలని అడగడం వాస్తవమే కాని ఆయన మృతికి మాకు ఎలాంటి సంబంధం లేదని బ్యాంకు అధికారులు వివరణ ఇచ్చారు.

## అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ అమరవీరుల త్యాగం ఫలితం వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని జడ్పీ ఛైర్‌పర్సన్ వనజమ్మ అన్నారు. గురువారం జడ్పీ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని అమరవీరులకు నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితం వల్లే మనకు తెలంగాణ సిద్ధించిందని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష మాట్లాడుతూ అమరులను మనం ఎల్లప్పుడూ సంస్మరించుకోవాలన్నారు. వారి ఆశయాలను పాటిస్తూ ఉండాలన్నారు. అమవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జడ్పీ వైస్ ఛైర్మన్ సురేఖ, జిల్లా అధికారులు గోపాల్, యాదగిరి, నరెందర్, హతిరాం, జడ్పీటిసిలు అంజలి, లావణ్య, సూర్యప్రకాష్‌రెడ్డి, అశోక్‌గౌడ్, జడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు తరచుగా నిర్వహించాలి

**నారాయణపేట ప్రతినిధి, జూన్22 ప్రభాతవార్త:** స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు తరచుగా నిర్వహించుకోవడం వల్లవిద్యార్థులకు బోధించే బోధన ఇతర సమస్యలు తెలుస్తాయని జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. గురువారం పట్టణంలోని స్కిల్ సెంటర్‌లో సమగ్రశిక్ష నారాయణపేట జిల్లా కలెక్టర్ సౌజన్యంతో వెలుగు అభ్యసన మిత్ర వర్క్‌బుక్ కార్యక్రమంలో 4,5 తరగతులకు బోధించే తెలుగు, ఆంగ్లము, గణితం బోధించే అభ్యసన సామర్థ్యాలపై సమావేశం నిర్వహించారు. తరచూ తల్లిదద్రులతోసమావేశం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. బోధించిన సబ్జెక్టుల వారిగా ఫీడ్ బ్యాక్ ఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, డీఈఓ రవిందర్, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒలంపిక్ డే రన్‌ను ప్రారంభించిన అదనపు ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త:** స్పోర్ట్స్ అథారిటి ఆదేశాలతో రాష్ట్ర ఒలంపిక్ డే రన్‌ను పురస్కరించుకుని గురువారం ఉదయం 6.30 గం.లకు స్టేడియం మైదానం నుండి రన్‌ను జిల్లా ఎస్పీ నాగేంద్రుడు జెండా ఊపి ప్రారంభించారు. ఎఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి క్రీడలపై మక్కువ చూపాలని అందుకు ప్రతి ఒక్కరు పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి సంవత్సరం ఒలంపిక్ డేను గురునత చేసుకుని ఒలంపిక్ క్రీడలను, క్రీడల పట్లఆసక్తి యువతపెంచుకునేలా చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐ రవిబాబు, మైనార్టీ స్కూల్, కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు, దాదాపు 250మంది పాల్గొన్నారు. రిటైర్డ్ పిఇటినరసింహులు, ఎస్జీఎఫ్ సెక్రెటరీ నరసింహులు, వాలీబాల్ సంఘంసెక్రెటరీ అమరేష్, జనార్ధన్, డివైఎస్ఓఆఫీస్ ఇంఛార్జి సాయినాథ్, పిఇటిలు ఆంజనేయులు, బాల్‌రాజ్, వెంకటప్ప, అనంతసైన్, రామకృష్ణ, పర్వీన్‌బేగం, భీంరెడ్డి, అజిత్‌కుమార్ పాల్గొన్నారు.